# బ్రహ్మానందలహరి

## దశమగ్రహం

**సింహప్రసాద్**


శ్రీలక్ష్మి చెల్లెలి పెళ్లికెళ్లారు శ్రీలక్ష్మి బ్రహ్మానందం.

శ్రీలక్ష్మి వెంటనే పెళ్లి పనుల్లో పడిపోయింది. బ్రహ్మానందం మరో రకమైన పనిలో పడ్డాడు.

పెళ్లికి కొన్న చీరలూ నగలూ దగ్గర్నుంచి కూరలూ ఆకుల వరకూ సమస్తమూ ఎన్నెన్ని కొన్నారో ఎంతకి కొన్నారో కనుక్కుంటూ పుస్తకంలోకి ఎక్కించేస్తున్నాడు బ్రహ్మానందం. ఆఖరికి భజంత్రీల్ని చాకలి మంగళ్లని కూడా వదల్లేదతడు.

"ఎంత మంచి అల్లుడూ. అన్నీ వివరంగా కనుక్కుని లెక్కలు రాస్తున్నాడు. ఎక్కడా ఏమీ మిస్ కాకుండా మాట తేడాలు రాకుండా ముందు చూపుతో రాస్తున్నాడు సుమా" అని కొందరు మెచ్చుకున్నారు అతడ్ని.

"ఇతడో చాదస్తపు మొగుళ్లా వున్నాడే. అరటి ఆకుల్లో కూడా కొసముక్కలెన్ని మధ్యముక్కలెన్ని అని లెక్కేస్తున్నాడు చూడు" అన్నవాళ్లూ వున్నారు.



అయినా ఎవర్నీ ఏమీ పట్టించుకోకుండా తన పరిశోధనా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించేశాడు బ్రహ్మానందం.

అతడ్ని చూసి అంతా ఎక్కడ నవ్విపోతారోనని శ్రీలక్ష్మికి కంగారుగా వుంది. ఇదంతా ఎక్కడికి దారి తీస్తుందోనని మావగారు కాంతారావుకి భయంగా వుంది. అసలిదంతా ఎందుకో ఏవిటో తెలీక బావమరిది అనంత్‌కి కన్ఫ్యూజన్‌గా వుంది.

పెళ్లయింది. పెళ్లి కూతుర్ని అత్తవారింటికి సాగనంపారు. బంధువులంతా ఎక్కడి వాళ్లక్కడ సర్దుకున్నారు. పందిట్లో మావగారు లెక్కలేస్తూ కూర్చుంటే గదిలో బ్రహ్మానందం లెక్కలు రాస్తూ కూర్చున్నాడు.

"అర్ధరాత్రి వేళ అంకాలమ్మ శివాలన్నట్టు ఇప్పుడీ లెక్కల గొడవేంటండీ పడుకోండి" ఆవులిస్తూ అంది శ్రీలక్ష్మి.

"ఇది లెక్కల గొడవకాదు, డబ్బుల గోల. ఇహ నిద్రెలా పడుతుంది చెప్పు?"

"అంటే ఏవిటంటారు?"

"లెక్కలు పూర్తవ్వొచ్చాయి ఒక్క నిమిషం... హమ్మయ్య! పూర్తయిపోయింది. మీ నాన్న నీ పెళ్లి కన్నా మీ చెల్లెలి పెళ్లి ఘనంగా చేశాడు. కట్నం ఎక్కువిచ్చాడు. భోజనాల్లో ఒక కూరా ఒక పచ్చడీ అప్పడం ఎక్స్ట్రా వేశారు. చీరలు రెండెక్కువ కొన్నారు. మన పెళ్లిలో కుట్టుడాకుల్లో భోజనాలు వడ్డించారా ఇప్పుడేమో అరటి ఆకులు వేశారు. వాటిల్లో కొసముక్కలే ఎక్కువ తెలుసా?"

"అవ్వ! ఎందుకొచ్చిన పోలికలండీ ఇవి. ఎవరైనా వింటే నవ్విపోతారు"

"నవ్వించిన సినిమాకే కాసుల వర్షం కురుస్తుందే పిచ్చిదానా" అంటూ లేచి పందిట్లోని మావగారి దగ్గరికెళ్లాడు బ్రహ్మానందం.

"రావోయ్ అల్లుడూ. ఇంకా పడుకోలేదా?" కాంతారావుగారడిగారు.

"మీరో సంగతి తేల్చి చెప్పేస్తే సంతోషంగా వెళ్లిపడుకుండిపోతాను. మీకు ఇద్దరు కూతుళ్లూ సమానమా కాదా? అది తేల్చండి చాలు"

"సమానమేనయ్యా! ఇద్దరూ నా చెరో కన్నూనూ. నీకెందుకొచ్చిందా సందేహం?"

"బ్రతికించారు. మరటువంటప్పుడు ఇద్దరికీ సమానంగా ఖర్చుపెట్టాలి కదా?"

"అప్పటి ఖర్చు అప్పటిదీ ఇప్పటి ఖర్చు ఇప్పటిదీనూ. ఆ రేట్లకే ఇప్పుడు రమ్మంటే రావు కదా"

"రాకపోతే తగ్గించుకోవాలి. ఇలాటి తిరకాసులు మన దగ్గర కుదరవు. మా పెళ్లిలో కన్నా మీ చిన్నమ్మాయి పెళ్లికి అన్ని రకాలగానూ కలిపి మొత్తం పద్దెనిమిది వేలు ఎక్కువ ఖర్చు పెట్టారు. ఆ డిఫరెన్సు సొమ్ము ఇచ్చేస్తే వెళ్లి గుర్రుకొట్టి నిద్రపోతాను"

ప్రాన్పడిపోయారాయన.

"కంగార్లేదు. రేపివ్వండి. గుడ్‌నైట్"

లోపలికెళ్లి జరిగిందంతా భార్యకి చెప్పేసరికి ఆవిడా అదిరిపోయింది. "మా నాన్న అసలే అప్పుల్లో మునిగిపోయి వున్నాడండీ. మీరిలా బాధించడం భావ్యం కాదు"

"నిండా మునిగిన వాడికి చలేమిటి?"

"పైగా అంతా మీరు మంచివాళ్లనీ బుద్ధిమంతులనీ అనుకుంటూంటే మీరిలా అడగటం ఏం బావోలేదండీ"

"ఓహో. అదో చిక్కుందా? సరే. ఇరవై శాతం డిస్కౌంట్ ఇస్తాను. 14400 ఇచ్చెయ్యమను"

తల పట్టుకుంది శ్రీలక్ష్మి. మర్నాటి ఉదయమే బావమర్ది అనంత్ బ్రహ్మానందాన్ని లేపాడు.

"బావగారూ! త్వరగా లేచి రెడీ అవండి. ఎకవుంట్స్ చూసుకుందాం"

"అలాగుటోయ్. నువ్వు చాలా బుద్ధిమంతుడివోయ్. నిన్ను చూస్తోంటే ముచ్చటేస్తోందనుకో. పది అంకెలు లెక్కపెట్టు. అవి పూర్తయ్యేలోపు వచ్చి వాల్తాను"

మరి పది నిమిషాలకి బావాబావమరుదులిద్దరూ చెరో కుర్చీలో చెరో పుస్తకమూ పట్టుకుని కూర్చున్నారు.

"నీ లెక్కప్రకారం నాకెంత ఇవ్వాలో తేల్చి చెప్పు బామ్మర్దీ"

"మీరు మాకు 5200 ఇవ్వాలి బావగారూ!"

కడప బాంబు మీద పడ్డట్టు అదిరిపడ్డాడు బ్రహ్మానందం.

"నేన్నీకివ్వడం ఏవిటి? ఇదెక్కడి బిల్లప్పు? నా చెవిలో పూలచెట్లు కనిపిస్తున్నాయా?"

"వివరణ అడిగితే చెబుతాను కదా బావగారూ అలా చెమటలు కక్కుతారెందుకూ?"

"అలాగా నాయనా! చెప్పు. చెప్పవోయ్ చెప్పు. ఏం చెబుతావో చెప్పు"

"అయిదేళ్ల క్రితం మీకిచ్చిన కట్నమూ చేసిన పెళ్లి ఖర్చులకి బ్యాంకు వడ్డీ ప్రకారం లెక్కకట్టి ఇప్పటి ఖర్చు తీసేస్తే మీరే తిరిగి ఇవ్వాల్సొచ్చారు బావగారూ! మీరు పెద్దమనిషి గనుక వెంటనే ఆ సొమ్ము ఇచ్చేస్తే చిన్నాచితకా బాకీల్ని తీర్చేస్తాం"

"ఆ పప్పులేం మన దగ్గర వుడకవోరే బామ్మర్దీ. లెక్కలు లెక్కలే. వడ్డీలు కావు"

"ఎలా కాకుండా పోతాయండీ"

"నేను చెబుతున్నాను గనుక పోతాయంతే. సరే. నువ్వు

మరీ బ్రతిమాలుతున్నావు గనుక నలభై పర్సంట్ డిస్కౌంట్ ఇస్తాను. మిగతాది త్వరగా ఇచ్చెయ్యండి. నా దగ్గర వేషాలెయ్యాలని చూడకండి మరి. సర్కస్ జంతువుల్ని ఆడించినట్టు ఆడించేస్తాను ఏమనుకుంటున్నారో''

''అదికాదు బావగారూ!''

''ఇంకేం చెప్పొద్దు. తిన్నగా వెళ్లి మీ నాన్నకి చెప్పు. నా స్టయిలే వేరు. గుర్తుంచుకో. ఇవ్వకపోతే నా విశ్వరూపం చూపించాల్సొస్తుంది. దట్సాల్'' స్టయిలుగా నడుస్తూ ఇంట్లోకెళ్లిపోయాడు బ్రహ్మానందం.

మరి కాస్సేపటికి మావగారొచ్చారు.

''నా పరిస్థితి నీకు తెలీందేవుంది అల్లుడూ. పోనీ రెండు వేలిస్తాను...''

''హమ్మో! అంత డిస్కౌంటా? దివాళా తీసెయ్యనూ. సారీ. నేనివ్వలేనండి''

''నువ్వు మంచి వాడివి. అన్నీ తెలిసినవాడివి. అంతకు మించి తూగలేను బాబూ''

''మరీ మొహమాటపెట్టేస్తున్నారు గనుక నాలుగు వేలివ్వండి ఎలాగో సర్దుకుంటాను''

ఇంకేం మాట్లాడలేక నిస్సహాయంగా చూశారు. ''కాస్త డబ్బు సమకూడగానే...''

''ఓ మూడు నెలలు టైము తీసుకోండి''

భారంగా అడుగులేస్తూ ఆయన వెళ్లగానే శ్రీలక్ష్మి అంది ''మీరింత డబ్బు మనిషిగా మారతారని కలలో కూడా అనుకోలేదు''

''పూరికే నాలుగు వేలు వచ్చి ఒళ్లో పడితే చేదా? నా తెలివి తేటల్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించవే''

★★★

''మా నాన్న ఉత్తరం రాశారండీ. బాకీ డబ్బు ఒక నెల రోజుల్లో పంపిస్తానన్నారు. ఎల్లుండి మా చెల్లెల్ని కాపురానికి పంపిస్తున్నారట. మనల్ని రమ్మని రాశారు''

''నేను రాను. ఆఫీసులో చచ్చేంత పనుంది. కావలిస్తే నువ్వెళ్లు''

''కాపురం పెట్టేక ఏకంగా మా చెల్లెలింటికెళ్లి వస్తాన్లెండి''

హఠాత్తుగా బ్రహ్మానందం ముఖంలో ఫీలింగ్సు మారిపోయాయి.

''కొత్తకాపురం కదూ! సారెలూ సామాన్లూ పెడతారు కదూ?'' సంశయిస్తూనే తలాడించింది.

''మరలా చెప్పవేం. నేనూ శలవుపెట్టేసి వచ్చేస్తాను. ఇంచక్కా ఇద్దరం కలిసి మీ చెల్లెలి కాపురాన్ని చూసొద్దాం''

''ఆఫీసులో పని వుందన్నారుగా?''

''ఎప్పుడూ వుంటూనే వుంటుంది. ఆఫీసు గురించి మనకి కలిసొచ్చేది పోగొట్టుకుంటామా?''

అయోమయంగా చూసిందామె. చిద్విలాసంగా నవ్వేడు బ్రహ్మానందం. ఇద్దరూ వూరికెళ్లారు. శ్రీలక్ష్మి చెల్లెలి కాపురం బాగుండాలని ఆశీర్వదించారు. ఆ పిమ్మట కాగితం కలం తీసుకుని మావగారు పెట్టిన సారె సామాన్ల వివరాలూ ధరలూ నోట్ చేస్తూ కూర్చున్నాడు బ్రహ్మానందం.

''ఇవన్నీ ఎందుకు అన్నయ్యగారూ'' తోడల్లుడు అడిగాడు.

''నీకర్థం కాదులే. దీన్ని రీసెర్చి అంటారు''

ఇంటికి తిరిగొస్తూనే మావగారికి ఉత్తరం రాసేశాడు. తనకి పెట్టిన సామాన్ల లిస్టు, తోడల్లుడికి పెట్టిన సామాన్ల లిస్టూ జతచేసి రెంటికీ వున్న తేడా రెండు వేలనీ దాన్ని వెంటనే పంపించెయ్యమని కోరాడు. సంగతి విని నుదురు కొట్టుకుంది శ్రీలక్ష్మి. ''మీ వరసేం బావోలేదు. పెళ్లయి అయిదేళ్లయినా ఇంకా మావగార్ని నంజుకు తింటానంటారేవిటండీ ఖర్మ''

''ముద్దొచ్చినప్పుడే చంకెక్కాలే''

''అసలే కామేశ్వరి కూపీ లాగుతోందే అని నేను భయపడుతోంటే మీరు మరీ రెచ్చిపోతున్నారు. ఆఖరికి కొంపమీదికి ఏం వుపద్రవం వచ్చిపడుతుందో ఏమిటో?''

''ఎవరా కామేశ్వరి? ఏమావిడ కథ? నాక్కూడా చెప్పవే కొంచెం జాగ్రత్తగా వుంటానూ''

''ప్రక్కవీధిలోని తెల్ల మేడలో వుంటోందావిడ. స్త్రీ చైతన్య సంఘం సెక్రటరీలెండి. మీ గురించావిడకి ఎవరో ఏదో చెప్పారట. కట్నం దగ్గర్నుంచి అన్ని వివరాలూ ఆరా తీస్తోంది. ఇప్పుడీ సంగతి కూడా తెలిస్తే...''

**పేజీల్లో సినిమా చూపించే**
**కొత్త ఎక్స్‌పరిమెంటు...**
**కామెడీ పిప్పరమెంటు...**

**హాస్య కథల కదంబం**
**ఈ బ్రహ్మానందంగారి!**

''హమ్మో! పొరబాటున కూడా నువ్వు నోరు జారకే. ఏవీ చెప్పొద్దు. ఆవిడ సంగతులు తెలుసుకుని పేపర్ వాళ్లకి వుప్పందిస్తే వాళ్లు బాక్సు కట్టి ప్రచురిస్తే నా ప్రెస్టేజ్ గంగలో కలిసిపోద్ది. ఆఫీసులో నవ్వులపాలవుతానే. పోలీసుకేసు కూడా అవ్వుద్ది''

''తెలుసండీ. చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా అన్నారు''

''అన్నీ తెలిసి నీ పతిదేవుణ్ని ఇలా క్షోభకి గురి చెయ్యడం ఏం న్యాయం? ఇదేనా పతివ్రతా ధర్మం?''

''నాకు తెలిసిన ధర్మం ఇదే''

''అయ్యో! ఇప్పుడెలాగా దేవుడా?''

''అంతా వుత్తుత్తి నాటకమని మా నాన్నకి రాసెయ్యండి''

''చూస్తూ చూస్తూ ఎలా రాయనే? ఒకటా రెండా? ఆరు వేలు. పోనీ ఓ పని చెయ్యి శ్రీలూ. జరిగిందేదో జరిగిపోయింది. దాన్ని వసూలు చేసేసుకున్నాక ఇంకెప్పుడూ ఇలాటి డిమాండ్స్ చెయ్యను. చేస్తే నీ ఎడం కాలి చెప్పుతో కొట్టు. సరేనా?''

ఆమె ఏమీ మాట్లాడలేదు. అవుననలేదు కాదనలేదు. అతడి వంక అదోలా చూసి లోపలికెళ్లిపోయింది. జుట్టు పీక్కుంటూ కూర్చున్నాడు బ్రహ్మానందం! మరి రెండ్రోజులకి అనంత్ వచ్చాడు.

బ్రహ్మానందం ఆఫీసునుంచి రాగానే ఎదురెళ్ళి ''నమస్కారం బావగారూ. ఇదిగో మీ డబ్బు'' అని పూలపొట్లం మధ్య నోట్ల కట్టలుంచి అందించాడు అనంత్.

నాలుగువైపులకీ భయంగా చూసి గబుక్కున పొట్లం తీసుకున్నాడు.

''మొత్తం ఆరు వేలు. లెక్కపెట్టుకోండి బావగారూ''

నోట్ల కట్టమీద చెయ్యి వేయబోయి ఎందుకో జంకి పొట్లం కట్టేశాడు.

''శ్రీలూ! మీ తమ్ముడికీ నాకూ ఫస్ట్ క్లాసైన ఫిల్టర్ కాఫీ పట్రా. ఏమైనా మీనాన్న చాలా పెద్దమనిషోయ్''

''అవును బావగారూ. అందుకనే మా నాన్నగారికి షష్ఠి పూర్తి చేద్దామనుకుంటున్నాం''

''చెయ్యండోయ్. చాలా మంచి ఆలోచన''

కాఫీలు తెచ్చిస్తూ ''మా చెల్లెలు షష్ఠి పూర్తికి పది వేలు ఖర్చుపెట్టి మా అమ్మానాన్నలకి పట్టుబట్టలూ వుంగరాలూ కొంటోందిటండీ. అన్నిటా వాళ్ళతో పోటీ పడ్డవాళ్ళం. ఇందులో మాత్రం ఎందుకు వెనుకంజవేస్తాం? అందుకని మేమూ పదివేలు ఖర్చుపెడతామని చెప్పాశానండీ'' అంది శ్రీలక్ష్మి.

''ఏవిటీ? పదివేలు! హమ్మో!'' మూతికాలిన పిల్లిలా గంతులేశాడు బ్రహ్మానందం.

''పెద్దల్లుడు గనుక అవసరమైతే కొంత ఖర్చు కూడా భరిస్తారని మీ మాటగా చెప్పేనండీ''

''అమ్మోయ్ నాయనోయ్. నీ వాగ్దానాలకో నమస్కారం తల్లోయ్''

''అలా ఇదైపోతారేమిటి? రావాల్సినవి పీకల మీద కూర్చుని వసూలు చేసి, పెట్టాల్సొచ్చినప్పుడు పిరికితనం చూపుతారేమిటండీ. బ్రహ్మానందం ది గ్రేట్ జూనియర్ ఆఫీసరా మజాకా''

''బావగారు ఇంకా ఎక్కువ ఇద్దామనుకుంటున్నారేమో అక్కా''

''హమ్మో! రెచ్చిపోకండి బాబోయ్! కాస్త తగ్గండి. ఆకాశం మీంచి నేలమీదకి రండి. నాయనా బామ్మర్దీ! బుద్ధిగడ్డితిని ఏదేదో కూశాను. ఏదేదో రాశాను. నీ డబ్బు నేను తిరిగి పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తున్నాను. తీసుకెళ్ళు నాయనోయ్. షష్ఠి పూర్తి ఖర్చులూ అవీ నానెత్తినేం రుద్దొద్దు తండ్రోయ్!''

''అలా తేక జాడిస్తారేవిటండీ. మనకెంత అవమానం ఎంత ఇస్తల్లూ ఎంత అదీ ఎంత ఇదీ!''

''అవన్నీ భరిస్తానుగానీ శ్రీలూ ఇది భరించలేను. అత్యాశకి పోయాను. బుద్ధొచ్చింది. లెంపలేసుకుంటున్నాను. ఇక వదిలెయ్యండి'' లెంపలేసుకున్నాడు బ్రహ్మానందం.

పడీ పడీ నవ్వేరు శ్రీలక్ష్మీ అనంతూ.

''ఆ నవ్వులేవిటే. నేను పిచ్చి మాలోకంలా కన్పిస్తున్నానా''

''షష్టిపూర్తీ లేదు ఖర్చూ లేదండీ. మీకు బుద్ధిచెప్పడానికి నాటక మాడాం.'' అంది శ్రీలక్ష్మి.

''భలేగా బుద్ధి చెప్పేరోయ్. ఇంకెప్పుడూ పరాయి సొమ్ముకి అర్రులు చాచను. ఆశపడను. నువ్వూ పడొద్దోయ్ బామ్మర్దీ''

''ఇప్పుడు మా బావగారన్పించారు''

''అంటే ఇంతవరకూ కాదా?''

''ఇంతవరకూ మా నాన్నగారి నెత్తికెక్కిన దశమగ్రహం!''